క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

జైనథ్: వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రసిద్ధి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో, బుధవారం ఆలయ కమిటీ సిబ్బంది మొక్కలు నాటారు. ఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో మొక్కలు నాటితే ఆధ్యాత్మికతకు తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రుకేష్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకట రమణాచార్యులు, సాయి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ఆదిలాబాద్‌రూరల్: వర్షాలు కురుస్తున్నందున వసతి గృహాల్లోని విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆయా సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: మండల కేంద్రలోని సాయినగర్‌లోని బుడగ జంగం కాలనీకి చెందిన ఇర్నాల వెంకటేశ్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. కాగా పేద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి స్థానిక నాయకుడు ఎర్రోళ్ల లింగారెడ్డి రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నేడు కేసీఆర్ కిట్‌ల పంపిణీ

బోథ్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం సొనాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేసీఆర్ కిట్‌లను పంపిణీ చేయనున్నట్లు మాజీ ఎంపీపీ, తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల శ్రీనివాస్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి 'కేసీఆర్ కిట్' ను అందించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతతో తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఆ సంఘం అధ్యక్షురాలు పడిగల శైలజ తెలిపారు. నాయకులు కోల పరిజాత, భాగ్య, శ్రీదేవి, మీన, సుప్రియ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి

బోథ్: ఈనెల 27న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్ర రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పంద్రం శంకర్ కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలతో సమావేశమయ్యారు.ఆడేం భీంరావ్, మాడవి గంగారాం, కనక అమత్‌రావ్, కొడప రమేశ్, ఆత్రం సుదర్శన్ పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు అన్యాయం

ఉట్నూర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నీటిని ఆంధ్రకు దోచి పెట్టేందుకు ముఖ్యమంత్రి చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బాబా శ్యామ్ టైగర్, సాజిద్ సిద్ధిక్, కోటేశ్, బొడ్డు నరేశ్, మరికంటి కిరణ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో యంగ్ లీడర్స్ క్లబ్

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఆంగ్ల భాష నైపుణ్యం సాధనే లక్ష్యంగా యంగ్ లీడర్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఐటీడీఏ డీడీ అంబాజీ అన్నారు. బుధవారం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ప్రతీ పాఠశాలలోని ఆరు నుంచి ఎనిమిది తరగతి విద్యార్థులకు ప్రతీ గురు, శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన విద్యార్థులు ధారళంగా మాట్లాడే విధంగా తయారు చేసేందుకు యంగ్ లీడర్స్ క్లబ్స్ ఉపయోగపడతాయన్నారు. శిక్షణ ఏసీఎంవో జగన్, భారత్ దేఖో సంస్థ డైరెక్టర్ రొమిల్లా, శిక్షకులు పాల్గొన్నారు.

సీడీపీవోకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో వనజను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. బుధవారం రణదీవెనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెలలో ఉద్యోగ విరమణ పొందనున్న ఆమెను సత్కరించారు. అంగన్‌వాడీల బలోపేతం కోసం పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రెయినేజీ స్లాబ్‌పనులు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు



డ్రెయినేజీపై నిర్మించని స్లాబ్

ఆదిలాబాద్‌రూరల్: ప్రజల ఇబ్బందులు, గుంతల రోడ్డు వాహనాలు మొరాయిస్తున్నాయని, పది నిమిషాల ప్రయాణానికి గంటల తరబడి సమయం అవుతుందని ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. అయితే గత ఏడాదిన్నర కిందట ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి శ్మశాన వాటిక సమీపంలో గల జాతీయ రహదారి నుంచి జైనథ్ మండలంలోని నిరాల వరకు వయా లాండసాంగ్వి మీదుగా సుమారు 14.4 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. వీటికి రూ. 40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ రూ. 30 కోట్లకు టెండర్‌ను దక్కించుకున్నారు. ఈ పనులు నేషనల్ హైవే పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. అయితే ఇక్కడి వరకు బాగానే ఉంది. ఇంకా గ్రామాల్లో పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పనులు పూర్తికాక ఇబ్బందులు..

వర్షపు నీరు, గ్రామాల్లోని మురుగునీరు కాలువలలోకి వెళ్లేందుకు బీటీరోడ్డుకు అనుకోని డ్రెయినేజీ చేపడుతారు. అయితే మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో బీటీరోడ్డుకు అనుకోని డ్రెయినేజీ నిర్మించారు. అయితే ప్రజలు నివాసముండే కాలనీల్లో కొన్ని చోట్ల డ్రెయినేజీపై స్లాబ్ వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్లాబ్ లేక ప్రమాదాలు..

గ్రామాల్లో బీటీరోడ్డుకు అనుకోని డ్రెయినేజీపై స్లాబ్ వేయని చోట కొంత మంది ప్రజలు తాత్కాలికంగా స్లాబ్ ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. దానిపై నుంచి దాటే సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు అదుపు తప్పి మురికి కాలువలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. గతంలో కొనసాగిన రోడ్డు నిర్మాణ పనులు గత కొన్ని నెలల కిందట నిలిచిపోవడంతో అసంపూర్తిగా ఉన్న స్లాబ్ పనులు కొనసాగిస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు చేయిస్తాం

ఆదిలాబాద్ నుంచి నిరాల వరకు చేపట్టిన బీటీ రోడ్డుపై బీసీ లేయర్‌తో పాటు అక్కడక్కడ డ్రెయినేజీపై స్లాబ్ పనులు చేపట్టాల్సి ఉంది. పనుల ప్రారంభంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తాం. వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– సుభాష్, డీఈ, నేషనల్ హైవే

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోథ్ మండలంలో బుధవారం నిర్వహించిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, కార్తీక్, నిఖిల్, ముక్కురం, నితీష్, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలన్నారు. కార్పొరేట్ ఫీజులను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన బంద్ విజయవంతమైందని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగదేవ్ పటేల్ అన్నారు. విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయని, ప్రభుత్వం వెంటనే రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని సత్వరం తొలగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జాడి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృషి చేస్తున్నారని ఖానాపూర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆత్రం రాహుల్, ఉట్నూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆత్రం తిరుపతి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో 49 నిలిపివేతకు కృషి చేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గిరిజనులను మధ్యపెడుతున్నారని, గతంలో జైనూరు ఘటనలో గిరిజనులు, గిరిజనేతరులు ఇబ్బంది పడితే ఏ మాత్రం స్పందించ లేదన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జును విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో కోట్నాక్ ఉమేష్, ఆత్రం మోతీరాం, మెస్రం భాగ్యలక్ష్మి, కౌసల్య, సులోచన పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆకుల రాజశేఖర్

ఇచ్చోడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని స్థానిక సంస్థల ఎన్నికల ప్రవారి లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలతయంలో మండల అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు, ప్రజలతో ప్రత్యేక సంబంధాలను కొనసాగించే విధంగా ప్రణాళికతో ముందుకు పోవాలని కోరారు. సమావేశంలో జాదవ్ రాము, గుమ్మడి భీంరెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, పాండురంగ్, తులిసిరామ్, శ్రీనివాస్, సునీల్, భరత్, వినాయక్‌రావు, సత్యప్రకాశ్, మల్లేష్, సంతోష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నేరడిగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. మండలంలోని అత్యధిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, నాయకులు గట్టు నారాయణ, వెంకటేశ్, కృష్ణ, కోట్నాక్ కోటేష్, పరుశురాం జాదవ్, ఆడెపు నరేందర్, మహేందర్ రెడ్డి, డోకుర్ భోజన్న పాల్గొన్నారు.

తలమడుగు: స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కలిసికట్టుగా పని చేస్తేనే విజయం సాధిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి రెడ్డి, చంద్రకాంత్, ప్రభాకర్, మోహన్ అగర్వాల్, నక్క ధనుంజయ్, ప్రేమేందర్ రెడ్డి, దాతాజి కిరణ్, స్వామి, దేవన్న, శ్రీనివాస్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

తాంసి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపెల్లి రాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రభారి మోహన్ అగర్వాల్, మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, సామ సంతోష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, అరుణ్ కుమార్, దేవేందర్, సదానంద్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మర్‌వాడలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు అక్రమంగా విక్రయిస్తున్న రాజారపు విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.3,890 విలువ గల 4 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ మండల ప్రధాన కార్యదర్శి దిలీప్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ మండల తహసీల్దార్ గోవింద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు సయ్యద్ ఫయాజ్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన వి.దంగా సీపీఎస్ రద్దుచేసి, ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జీ వో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ వారి సొంత జిల్లాలకు వెంటనే పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎ.నర్సిములు, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

ఇచ్చోడ: మేడిగూడ క్లస్టర్ పరిధిలోని నారాయణ్‌పూర్ గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల భవనాన్ని పీజీ హెచ్‌ఎం స్వర్ణలత బుధవారం ప్రారంభించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం పాఠశాల భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉండే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు.

వాగు దాటి.. వైద్యం అందించి..



వాగు దాటుతున్న ఏఎన్‌ఎం, ఆశవర్కర్

ఇంద్రవెల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటి ఏఎన్‌ఎం విజయసుందరి, ఆశ కార్యకర్త మైనాబాయిలు మండలంలోని మామిడిగూడ గ్రామానికి చేరుకొని బుధవారం వైద్య సేవలు అందించారు. చిన్నాపిల్లలకు, గర్భిణులకు టీకాలు వేశారు. పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి చికిత్స అందించారు. ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛత, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మహాగర్జన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

నేరడిగొండ: బీడీ, గీత, నేత కార్మికులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అందే పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న నిర్వహించనున్న 'చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన'ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే మహాగర్జనలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. హామీలు నెరవేర్చాలని, చేయూత పథకంలో కార్మికులకే కాకుండా, అర్హులైన వర్గాలకు కూడా పెన్షన్ పెంపు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు గజ్జల శంకర్, కనక కిషన్, షేక్ మోహినొద్దీన్, సింగరపు లస్మన్న పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో ఈనెల 25న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. యువతీ యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సునీల్ జాదవ్, రాజవ్వ, అవినాష్, భూచ్చన్న, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బేల: ఉట్నూర్‌లోని పేర్కగూడ జేసీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోడే అవినాష్, సభ్యులు ధర్నే విజయ్, మేకల జితేందర్, కాక్రే విపిన్, వాంఖడే నయన్, ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రరూరల్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మే ళాను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మావలలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు.

పొచ్చెర జలపాతం వద్ద బోటింగ్



బోటింగ్ చేస్తున్న సిబ్బంది

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం ఎగువన గల చెక్‌డ్యాంలో బుధవారం బోటింగ్ నిర్వహించారు. నీరు పుష్కలంగా ఉండటంతో కర్ణాటక నుంచి వచ్చిన బోటింగ్ శిక్షణ బృందం బోటింగ్ ఎలా చేయాలో ఫారెస్ట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. దాదాపు రెండు గంటల పాటు అటవీశాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రణయ్, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్‌వో సంతోష్, అటవీశాఖ అధికారులు, మాసన అడ్వెంచర్ దండెల్లి శిక్షణ సిబ్బంది మహమ్మద్ షరీఫ్, మల్హార్, చేతన్ కురుగంధ్, సోయ శేఖర్, ఆదర్శ్‌లు పాల్గొన్నారు.

పింఛన్ విడుదల చేయాలి

నేరడిగొండ: విడో పెన్షన్ వెంటనే విడుదల చేయాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పలు మార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భర్తను కోల్పోయిన నిరుపేద కుటుంబాల్లోని మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో విడో పెన్షన్ వారికి అండగా నిలుస్తుందన్నారు. మహిళల ఆర్థిక భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశమైన ఫొటోగ్రాఫర్లు

నేరడిగొండ: ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఫొటోగ్రఫీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సూర్య గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. నూతన టెక్నాలజీ పరిజ్ఞానం, డిజిటల్ రంగంలో మారుతున్న పరికరాలపై గురించి వివరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు కార్తీక్ కుమార్

బోథ్: బాలగంగాధర్ తిలక్ జయంతిని పురస్కరించుకుని బోథ్ మండంల కేంద్రంలో లోకమాన్య యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనం లోకమాన్య యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రముఖ యూరాలజిస్ట్ కుమ్మరి కార్తీక్ కుమార్, ఈఎన్‌టీ వైద్యురాలు కుమ్మరి రోషిణి, చిన్న పిల్లల వైద్యులు గౌతమ్, వైద్యులు దయాకర్, భీంరావ్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వారికి వైద్యులు ఆరోగ్య సలహాలు అందించారు.

నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు



విద్యార్థుల చదువుపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. మాన్కాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు గంగాపూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మాన్కాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయ హాజరు రిజిస్టర్, విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. రెగ్యులర్ వర్కర్ పేరుతో బినామీ వర్కర్ పని చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు అందజేయాలని ప్రధానోపాధ్యాయుడు మెస్రం ధన్నును ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు మెస్రం ధన్ను, వార్డెన్ చౌహాన్ సుభాష్, ఎస్‌సీఈఆర్‌పీ విజయ్ కుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ల్యాప్‌టాప్‌లు అందజేత

ఇచ్చోడ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం ముఖరా (కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగలు వచ్చాయని గుర్తు చేశారు.

టీవీ విరాళం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే పాఠశాలలో సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం టీవీ విరాళం చేశారు. ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్ సల్ల విజయ్‌బాబు, రమేశ్, శ్రీనివాస్, రవికాంత్, నవీన్ యాదవ్, షేక్ అలీ, కిరణ్ పాల్గొన్నారు.

25 నుంచి నిత్య రుద్రాభిషేకం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయంలో కొలువై ఉన్న శివలింగంకు సంతోష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు నిత్య రుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, దాముక రవీందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

'జ్వాల'తో ఆత్మవిశ్వాసం

బేల: జ్వాలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, అపద సమయంలో భరోసాగా ఉంటుందని ఎస్సై మధుకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో జిల్లా ఎస్పీ అఖీల్ మహాజన్ ఆదేశాల మేరకు జ్వాల శిక్షణను ప్రారంభించారు. విద్యాలయం ప్రత్యేకాధికారి గేడం నవీన, సీఆర్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్‌లో వర్షం

జైనథ్: మండలంలో గత 15 రోజులుగా కనుమరుగైన వర్షం బుధవారం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పంటలు జీవం పోసేలా ఉందన్నారు.

పండ్లు పంపిణీ

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో తహసీల్దార్ జాడి రాజలింగు చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్యురాలు రాజమణి, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, ఫార్మాసిస్ట్ విలాస్, సీనియర్ జర్నలిస్టులు చాల్కుర్ విజయ్, రాథోడ్ సంతోష్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు ఈ– పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల విధుల బహిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల ఈ– పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విధులు బహిష్కరించనున్నారు. అందులో భాగంగానే కమిషనర్ పంచాయతీ రాజ్ ముట్టడి చేపట్టనున్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

టీబీ నియంత్రణకు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో టీబీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో నిక్షయ్ శివిర్‌లో భాగంగా టీబీ గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీవాసులకు ఎక్స్‌రే, తదితర పరీక్షలు నిర్వహించారు. టీబీ లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.